క్లుప్తంగా

1 నుంచి శత వార్షికోత్సవ కుంభాభిషేకం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

గూడూరు: స్థానిక గాంధీబొమ్మ ప్రాంతంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మే 1 నుంచి 5వ తేదీ వరకూ శత వార్షికోత్సవ కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గిరిబాబు తెలిపారు. ఆహ్వాన పత్రికలను శనివారం ఆవిష్కరించారు. ఆలయం నిర్మించి వందేళ్లు అయిన సందర్భంగా ఈ ఉత్సవాలను 102 హోమ గుండాలతో నిర్వహించనున్నట్లు చెప్పారు. పాదర్తి ప్రసాద్, వాయిగండ్ల సుధాకర్ నాగసూరి సునీల్, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటకు చేరిన వాసవీ జ్యోతి జైత్రయాత్ర

సూళ్లూరుపేట : పెనుకొండ నుంచి చెన్నై వెళుతున్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి వాసవీ జ్యోతి జైత్రయాత్ర శనివారం సూళ్లూరుపేటకు చేరుకుంది. స్థానిక పాండురంగస్వామి ఆలయం సెంటర్‌లో వాసవీ జ్యోతికి ఆర్యవైశ్యులు హారతులిచ్చి స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి జ్యోతిని ఊరేగింపుగా కన్యకా పరమేశ్వరి ఆలయానికి తీసుకెళ్లారు. వాసవీమాతకు హారతులిచ్చిన అనంతరం భక్తులకు జ్యోతి దర్శనం కల్పించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు కాకి శ్రీరామ్మూర్తి, అయిత శ్రీధర్, అలవల ప్రభాకర్, అలవల సుధాకర్, అయిత నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

గూడూరు: స్థానిక గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి ప్రగతి సేవా సంస్థ ఫ్యాన్లు, పలకలు, ఇతర విద్యాసామగ్రిని అందజేసింది. సంస్థ సభ్యుల్ని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్‌కె మోహబూబీ అభినందించారు.

బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



గాయపడిన మహేష్, గణేష్

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. ఏకొల్లు గ్రామానికి చెందిన మహేష్ బైక్‌లో నెలబల్లి గ్రామ సమీపంలో రోడ్డు క్రాస్ చేసేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో నెల్లూరుపల్లికి చెందిన గణేష్ బైక్‌లో వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. గాయపడిన ఇద్దరిని 108లో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జార్ఖండ్‌కు మృతదేహం తరలింపు

నాయుడుపేట టౌన్ : మండలంలోని మేనకూరు సెజ్ పరిధిలోని హిందుస్థాన్ గ్లాస్ పరిశ్రమ క్యాంటీన్‌లో పనిచేస్తున్న దిలీప్ పాశ్వన్ (43) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అతని మృతదేహానికి శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో జార్ఖండ్‌కు తరలించారు. మృతుడి బావ నాగేశ్వర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరసింహారావు తెలిపారు.

ఎక్కువ కేసులు పరిష్కరిద్దాం


మాట్లాడుతున్న 7వ అదనపు జిల్లా జడ్జి

గూడూరు: మే 13న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ కాదగిన ఎక్కువ కేసులు పరిష్కారానికి నోచుకునేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం ఆదేశించారు. స్థానిక కోర్టులో శనివారం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐలు, ఎస్ఐలకు సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకుని పై విధంగా మాట్లాడారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.78,300

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ హుండీలోని కానుకల ద్వారా రూ.78,300 ఆదాయం వచ్చినట్టు దేవదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, కార్యనిర్వహణాధికారి పాయసం శాంతరావు తెలిపారు. హుండీలోని కానుకలను శనివారం లెక్కించారు. 15 రోజుల వ్యవధిలో ఈ మొత్తం వచ్చినట్టు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్దయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ


పల్లకీ సేవలో లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండలోని ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామికి శనివారం సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. తొలుత ఆలయంలో ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరణలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ కందల ఆనందబాబు మాట్లాడారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు


పథకాలు అందుతున్నాయయ్యా! అంటూ నేదురుమల్లికి చెబుతున్న మాణిక్యమ్మ,


వెంకటగిరి: మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

• నేదురుమల్లి రామ్‌కుమారెడ్డి

సైదాపురం: ప్రభుత్వం అములు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెలుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని కృష్ణారెడ్డిరెడ్డిపల్లె, తోచాంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. 400 కుటుంబాలను ఆయన పలకరించారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వారికి వివరించారు. తోచాం గ్రామంలో తాడిబోయిన మాణిక్యమ్మ అనే వృద్ధురాలు 'మా ఇంటికాడికే వలంటీర్లు పథకాలు అందిస్తున్నారయ్యా! నాకు పింఛను ఇస్తాండారు. ఆ జగను చల్లగుండాలి..రైతు భరోసా కూడా వచ్చింది' అని చెప్పడంలో అక్కడ నవ్వులు పూశాయి. దీనిపై నేదురుమల్లి మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో పథకాలు అర్హులకు కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలకే అందేవని విమర్శించారు. అర్హులై పథకాలు అందని వారు తమ దృష్టికి తేవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాబోవు ఎన్నికల్లోనూ ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నృత్య అకాడమి చైర్‌పర్సన్ పాట్టేళ్ల శిరీషాయాదవ్, జేఎస్‌సీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్, పార్టీ నేతలు ఆర్. మాల కొండారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, అబ్బిరాజు, శివయ్య, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, రామకృష్ణ, సురేంద్ర, రమణయ్య,శివకుమార్, చెమిర్తి శ్రీనివాసులురాజు తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లిని కలిసిన కోట నాయకులు

వెంకటగిరి : వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని శనివారం వెంకటగిరిలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు కొడవలూరు ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో కోట మండలానికి చెందిన పలువులు కలిశారు. నేదురుమల్లిని శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో చిట్టేడు పీఏసీఎస్ చైర్మన్ పి.నారాయణ, కోట జెట్పీటీసీ సభ్యుడు కోటయ్య తదితరులు పాల్గొన్నారు

జగన్‌కు 1.10 కోట్ల కుటుంబాల మద్దతు

వెంకటగిరి: రాష్ట్రంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ద్వారా 1.45 కోట్ల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ సైనికులు కలిస్తే 1.10 కోట్ల కుటుంబాలు మిస్డ్‌కాల్ ద్వారా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. మళ్లీ జగన్ సీఎం కావాలని సర్వేలో భాగంగా తమ అభిప్రాయాలను వివరించారని తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కలువాయి జెట్పీటీసీ సభ్యుడు బి అనిల్‌కుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, సైదాపురం జేసీఎస్ కన్వీనర్ మన్నారపు రవికుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, వెంకటగిరి, డక్కిలి, రాపూరు జేసీఎస్ కన్వీనర్లు పులిప్రసాద్‌రెడ్డి, సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

• ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ప్రస్తుతం అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే అది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్ఆర్ సీపీ నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు పీపుల్స్ సర్వే శనివారం ముగిసిందన్నారు. 75 శాతం మంది ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 1.45 కోట్ల కుటుంబాలు పాల్గొన్నాయని, 1.10 కోట్లకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. గూడూరు నియోజకవర్గంలో వంద శాతం మంది ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికే తమ మద్దతు ప్రకటించారని వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. నాడు-నేడుతో కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారని, అలాగే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో గ్రామాల్లో ఇళ్ల ముంగిటకే వైద్యసేవలు సైతం అందిస్తున్నారని ఉదహరించారు. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా పొందేలా చూస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు, నాయకులు గూడూరు రాజారెడ్డి, యారం మంజుల, శ్రీనివాసులరెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, గోపీయాదవ్, వాకాటి శ్రీధర్‌రెడ్డి, మోబీన్, అజీజ్, శ్రీనివాసులు, అన్నం మురళి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ


ఉపాధి కూలీలకు మజ్జిగ అందజేస్తున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లిలో చేస్తున్న ఉపాధి హామీ పనులను శనివారం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి పరిశీలించారు. రోజురోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు టార్పాలిన్ పట్టలు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూలీలకు సూచించారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎఫ్ఏ తిరుపాలు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి


శ్రీధనమల్లిలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆయన శనివారం శ్రీధనమల్లి గ్రామం, ఎస్సీ కాలనీ, వడ్డిపాళెం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ మంచి నీటి పథకం ఏర్పాటు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చెంగాళ్లమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ రమేష్, నాయకులు బాబురెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మునస్వామినాయుడు, రామచంద్రయ్యనాయుడు, పురుషోత్తం, బాబు, శేఖర్ పాల్గొన్నారు.

మధుయాదవ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

చిట్టమూరు : చిట్టమూరుకు చెందిన ఎన్‌డీసీబీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మేరిగల మధుయాదవ్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం పరామర్శించారు. మధు యాదవ్ తండ్రి కస్తూరయ్య కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. నేతలు గజేంద్రరెడ్డి, ఒట్టూరు కిశోర్ యాదవ్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షం

నాయుడుపేట టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఆర్‌అండ్ బీ అతిథి గృహంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు 1.45 కోట్లకు పైగా కుటుంబాలను కలిసినట్టు తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దువ్వూరు బాలచంద్రారెడ్డి, తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, అనిల్ రెడ్డి, కోళవి రఘు, కటకం దీపిక వెంకటకృష్ణా రెడ్డి, కలికి మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడే ను జయప్రదం చేయాలి

వెంకటగిరి: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పి బాలకృష్ణయ్య తెలిపారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో పలు కార్మికసంఘాల ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె జాన్, సీపీఐ నాయకులు కె అంకయ్య, వరుణ్‌కుమార్, మునేంద్ర, సుబ్బారావు, మునస్వామి, మునిరాజా పాల్గొన్నారు.

డాక్టర్ సీఆర్‌రెడ్డి చిరస్మరణీయులు


సీఆర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న రొటేరియన్లు

గూడూరు: ప్రజా వైద్యులు డాక్టర్ సీఆర్‌రెడ్డి చిరస్మరణీయులని ప్రముఖ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్‌రావు స్మరించారు. శనివారం స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సీఆర్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సమాచార సేకరణలో కీలకంగా వ్యవహరించాలి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసులు స్థానికంగా ఉండే ప్రజల సమాచారాన్ని సేకరించడంతో కీలకంగా వ్యవహరించాలని సీఐ నరసింహారావు సూచించారు. ఆయన శనివారం పోలీస్ స్టేషన్‌లో శనివారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమీక్షించారు.

ఘనంగా తైలాభిషేక పండుగ

చిల్లకూరు: యేసుక్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, క్షమా మార్గాలను అందరూ అనుసరించాలని సీఏఎస్ మినిస్ట్రీస్ సంఘ కాపరి బ్రదర్ టీ మోజస్ అన్నారు. చింతవరంలో శుక్రవారం రాత్రి మూడు రోజుల తైలాభిషేక పండుగను ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నంద్యాలకు చెందిన బ్రదర్ నేగల జాషువా, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

తుంగమడుగులో ఫ్యామిలీ ఫిజీషియన్

దొరవారిసత్రం : తుంగమడుగు గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఇంటిలోనే ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై ప్రజలకు అవగాహన కల్పించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి చైతన్య, సిబ్బంది కిరణ్, సుధాకర్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

ఏకొల్లు ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్ డే

దొరవారిసత్రం : ఏకొల్లు గ్రామ పరిధిలోని ఎస్టీ కాలనీలో శనివారం సాయంత్రం తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఎస్టీల హక్కులపై అవగాహన కల్పించారు. ఏ సమస్య ఎదురైనా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి రామయ్య పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

వెంకటగిరి రూరల్: మండలానికి సంబంధించి వచ్చే నెల 3న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ మండల సర్వసభ్యా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కరీముల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య, గ్రామాల్లో వసతులపై సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

శ్మశాన రోడ్డు ఆక్రమణపై నిరసన


పెన్నేపల్లె శ్మశాన రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లె గ్రామ సర్వే నంబరు 2లో గ్రామం నుంచి స్వర్ణముఖినదిలోకి ఉన్న శ్మశాన రోడ్డును స్థానిక పేపర్ మిల్లు యాజమాన్యం కబ్జా చేసిందని శనివారం పంచాయతీ పాలక వర్గం, వైఎస్సార్ సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆక్రమణల నుంచి శ్మశాన రోడ్డుకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు అడ్డంగా గేట్ ఏర్పాటు చేయడంతోపాటు ఆ భూమిలో వరిసాగు చేస్తున్నారని తెలిపారు. దీనిపై గతంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ పేపర్ మిల్లు యాజమాన్యం తీరు మారలేదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో చక్రపాణి, ప్రసాద్, అశోక్, సుకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న విభాగాధిపతులు

కోట: మండలంలో విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న అధ్యాపకులకు శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఎన్‌బీకేఆర్, వరంగల్‌కు చెందిన ఎన్ఐటీ సంయుక్తంగా ఈ శిక్షణ ఇచ్చాయి. మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, మెషిన్ లెర్నింగ్ అనే అంశంపై రాష్ట్రంలోని 130 మంది అధ్యాపకులు, పారిశ్రామిక వేత్తలు పాల్గొని వివిధ అంశాలపై పత్ర సమర్పణ చేశారు. అమెరికాకు చెందిన ప్రొఫెసర్ సౌందర్‌కుమార్ మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ వి.విజయకుమార్, సీహెచ్‌ఆర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

చోరీ చేయబోయి తన్నులు తిన్నాడు?


పట్టుబడిన యువకుడు

నాయుడుపేట టౌన్ : ఇక్కడ ఫొటోలో స్కూటీపై నవ్వుతూ ఉన్న యువకుడిని చూస్తే ఏమనిపిస్తుంది? బావున్నాడు.. చక్కగా ఉన్నాడే అనిపిస్తోంది కదూ!.. అలా నవ్వుతూ ఉన్నోడికి కాసేపటికి సీన్ సితార అయ్యింది. పట్టుకుని అందరూ చితకబాదారు. నవ్వు మాయం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. అతగాడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇంతకూ మేటరేమిటంటే.. సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కృష్ణ ఆర్టీసీ బస్టాండు ఆవరణలో స్కూటీని నిలిపి కంట్రోల్ పాయింట్‌లోకి వెళ్లాడు. ఇంతలో ఓ యువకుడు స్కూటీని నెట్టుకుంటూ వెళ్లసాగాడు. గమనించి అతడిని ప్రశ్నించడంతో స్కూటీ తనదేనంటూ బుకాయించాడు. చోరీకి పాల్పడుతున్నట్లు భావించి అతడిని చితకబాదారు. శనివారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. సమాచారమివ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. తన పేరు మణికంఠ అని, తనది విజయవాడ అని..తానో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఇతడు నేరస్తుడా, ఉద్యోగా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

సాగు భూములకు పట్టాలు ప్లీజ్!


నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఓజిలి: సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని భువనగిరిపాళెంకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు కోరారు. వారు తాము సాగు చేసుకుంటున్న భూముల వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో సర్వే నంబర్లు 67–3,4లో 8.02 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 17 కుటుంబాలు ప్రజలు సాగు చేసుకుంటున్నాయని, అధికారులు విచారణ చేసి తమకు పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై తహసీల్దార్‌కు కూడా వినతి పత్రం ఇచ్చామని చెప్పారు. సన్నిబోయిన సురేష్, మందా వెంకటేశ్వర్లు, కొండ్రుపాక వెంకటసుబ్బయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

'సెలవులను సద్వినియోగం చేసుకోండి'



చిల్లకూరు : ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహచరులు

గూడూరు రూరల్ : వేసవి సెలవుల్లో విద్యార్థులు తల్లిదండ్రుల మాటలు వినాలని విందూరు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం జయరామానాయుడు హితోక్తులు పలికారు. శనివారం పాఠశాల ముగింపు సందర్భంగా ఆయన పేరెంట్స్ కమిటీ, విద్యార్థులు తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. సెలవుల్లో విద్యార్థులు ఈత, బైక్ రైడింగ్‌కు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థిని చిట్టేటి వెంకటజ్యోత్స్నకు జ్ఞాపిక అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, జోసెఫ్, రఘురామ్, బాలమురళి, దయాకర్, అనిల్, పుల్లమరాజు, చంద్రశేఖర్, పీడీ కరిముల్లా, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పఠాన్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులను వృథా చేయొద్దు

చిల్లకూరు : వేసవి సందర్భంగా 40 రోజుల పాటు ఇచ్చే సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా రోజులో కనీసం రెండు గంటలైనా చదివితే ఉత్తమ ఫలితాలను సాధించగలరని నెలబల్లిరెట్టపల్లి జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం అక్కన రమణయ్య అన్నారు. శనివారం ఆ స్కూలులో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. డిప్యుటేషన్‌పై పని చేసిన గ్రంథం మాధవయ్య, చాట్ల నాగభైరవి, తేజోవతిని ఉపాధ్యాయులను సత్కరించారు. సెలవుల్లో బావులు, చెరువుల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడరాదని విద్యార్థులకు హితోక్తులు పలికారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరాజు, పెంచలయ్య, మస్తానయ్య, చంద్రశేఖర్, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌కు శంకుస్థాపన


ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వెంకటగిరి: స్థానిక మున్సిపల్ డంపింగ్‌యార్డు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఎఫ్ఎస్‌టిపి (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్ సెప్టిక్) కు శనివారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్ బాలయ్య, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిధులు మంజూరు చేయించి ఆదర్శమున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎంఎ నారాయణ, టి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిహెచ్ మురళీకృష్ణ, కమిషనర్ బివి రామయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు కోన ముస్తాబు

రాపూరు: పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు పెంచలకోన క్షేత్రం ముస్తాబవుతోంది. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు శ్రీవారి ప్రసా దాలు తయారు చేయడం శనివారం నుంచి ప్రారంభించారు. అనుమతులు తీసుకున్న దుకాణదారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీంతో పెంచలకోనకు బ్రహ్మోత్సవాల కళ సంతరించుకుంది.

చాగణం రోడ్డు నాణ్యత పరిశీలన

సైదాపురం: మండలంలోని చాగణం నుంచి జోగిపల్లి వరకు చేపడుతున్న ఎస్‌పీఎస్ రోడ్డు పనులను శనివారం పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్ పరిశీలించారు. పీఎంజీఎస్‌వై పథకం ద్వారా నిర్మిస్తున్న ఈ రహదారి నాణ్యతను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసులురెడ్డి, డీఈ ఏడుకొండలు, ఏఈ మవేక్ రెడ్డి తదితరులున్నారు.

నిత్య అన్నదానానికి విరాళం


పెంచలకోన ఈఓకు విరాళం అందిస్తున్న రాజసింహారెడ్డి

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నిత్య అన్నదాన పథకానికి వైఎస్సార్ జిల్లాకు చెందిన దొంతురెడ్డి రాజసింహారెడ్డి రూ.1,21,116 విరాళం శనివారం అందించినట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దాతకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం చేయించి, తీర్థ ప్రసాదాలు అందించినట్లు ఆయన తెలిపారు.

చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యకరం


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్ : చిరుధాన్యాలతో వండిన ఆహార పదార్థాలు తింటే ఆరోగ్యకరంగా ఉండవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బి గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో శనివారం గృహ విభాగం శాస్త్రవేత్త విజయశ్రీ పోషకాహార ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. గోవిందరాజులు మాట్లాడుతూ రాగి, జీడిపప్పు, జొన్న, మునగాకు, కొర్రలతో వంటకాలు ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపాల్, రాజీవన, సీడీపీఓ శంషాద్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో శిక్షకులు

కోట: మండలంలోని ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు మాథ్స్, సైన్స్ ఒలంపియాడ్‌లో ఉత్తమ ప్రతిభను కనబరచినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ శనివారం తెలిపారు. ఇటీవలే గుంటూరు జరిగిన ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

నాయుడుపేట టౌన్ : స్థానిక శివాలయం సమీపంలో రోడ్డు వద్ద శనివారం సత్యసాయి సేవా సమితి ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మొదలియార్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరీంబాయి చెంచయ్య ప్రారంభించారు.

పౌరహక్కులపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: ప్రతి ఒక్కరూ తమకు ఉన్న పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ కోరారు. స్థానిక మిక్స్‌డ్ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం పలు హక్కులను కల్పించిందని, హక్కులతో పాటు సమాజం పట్ల తమ బాధ్యతలేవో ప్రజలు గుర్తెరగాలన్నారు. ఎవరైనా కులం పేరుతో దూషించినా, తిట్టినా వారిపై కేసు నమోదు చేయవచ్చన్నారు. కాలనీలో నివసిస్తున్న వివిధ వర్గాల వారు కలిసిమెలిసి జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాల్, ఆర్ఐ రమ్యస్వాతి, వీఆర్‌ఓ రమణయ్య, జగదీష్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మల్లికార్జున్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్టు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

WANTED
మ్యాథ్స్, కెమిస్ట్రీ, సోషల్, హిందీ మరియు డ్రాయింగ్ సబ్జెక్టులందు బోధించుటకు ఉపాధ్యాయులు కావలెను.
కంప్యూటర్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ కూడా కావలెను.
ఆసక్తిగల అభ్యర్థులు పై పోస్టుల కోసం దరఖాస్తులను పంపగలరు
లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
గూడూరు. సెల్ : 9390830003